సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 9 । ఏప్రిల్ । 2024



ఊరంతా ఉగాది..

క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకల కోసం జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. షడ్రుచుల పచ్చడితో పాటు పిండివంటల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం పంచాంగ శ్రవణం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
37° / 24°

వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి వాతా వరణం కొంత వేడిగానే ఉంటుంది.

ఇఫ్తార్
(మంగళవారం సా॥)
6.29

సహర్
(బుధవారం ఉ॥)
4.33

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నిత్యాన్నదానానికి విరాళం..

భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత అన్నదాన కార్యక్రమానికి కొత్తగూడేనికి చెందిన భక్తులు సోమవారం విరాళం అందచేశారు. కొత్తగూడెం కూలీలైన్ ప్రాంతానికి చెందిన లింగాల రాజయ్య గౌడ్ – లక్ష్మి దంపతులు రూ.లక్ష విరాళాన్ని అందజేశాక, స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయి బాబ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు కలెక్టర్, ఎస్పీ ఉగాది శుభాకాంక్షలు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/కొత్తగూడెం టౌన్ : జిల్లా ప్రజలకు కలెక్టర్ ప్రియాంక ఆల ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగువారి పండుగల్లో ఉగాది ఎంతో గొప్పదని, షడ్రుచులతో చేసిన పచ్చడిని ప్రజలు ఇష్టంగా తింటారని పేర్కొన్నారు. ఎస్పీ రోహిత్‌రాజు కూడా ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ మరో ప్రకటన విడుదల చేశారు. ఇంకా కొత్తగూడెం, ఇల్లెందు ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివ రావు, కోరం కనకయ్య కూడా ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

కిన్నెరసానిని సందర్శించిన కలెక్టర్



బోటింగ్ చేస్తున్న కలెక్టర్, కుటుంబసభ్యులు

పాల్వంచరూరల్ : నిత్యం విధి నిర్వహణలో బిజీగా ఉండే కలెక్టర్ ప్రియాంక ఆల.. ప్రకృతి అందాలకు నిలయమైన కిన్నెరసానిని కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం సందర్శించారు. డీర్ పార్కులోని చుక్కల దుప్పులను, జలాశయాన్ని వీక్షించిన తర్వాత రిజర్వాయర్‌లో బోటింగ్ చేశారు.

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణకు నేడు కౌన్సెలింగ్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని టీఎస్ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో మూడు నెలల ప్రత్యేక ఫౌండేషన్ కోర్స్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఆసక్తి కలిగిన ఎస్సీ అభ్యర్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వంద మందికి శిక్షణ ఇవ్వనుండగా, అభ్యర్థుల ఎంపికకు ఖమ్మం టీఎన్జీవోస్ కాలనీలోని స్టడీ సర్కిల్‌లో మంగళవారం ఉదయం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ధృవపత్రాలతో నేరుగా హాజరుకావాలని, వివరాలకు 98484 94290 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఒక పోస్టుకు 123 మంది అభ్యర్థులు..

భద్రాచలం(భద్రాచలంఅర్బన్): భద్రాచలం ఏరియా ఆస్పత్రిలోని ఏఆర్టీ సెంటర్‌లో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు ఇటీవల నోటిఫికేషన్ విడుదల కాగా సోమవారం పరీక్ష నిర్వహించారు. కాగా ఈ పోస్టుకు 242 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 157 మంది పరీక్షకు అర్హత సాధించారు. ఇందులో 123 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. డీఎంహెచ్‌ఓ శిరీష, ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ, నోడల్ అధికారి మాధురితో పర్యవేక్షించారు. ఐదు రోజుల్లో ఫలితాలు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

మిథిలా.. వ్యథ !



నిర్వహణ సరిగా లేక అపరిశుభ్రంగా మారిన మిథిలా స్టేడియం



స్టేడియం లోపల మందుబాబులు తాగి పడేసిన గ్లాసులు, సీసాలు

60 ఏళ్ల క్రితం కల్యాణమండప నిర్మాణం

- ఎన్టీఆర్ హయాంలో మిథిలా స్టేడియం ఏర్పాటు
- నిరుపయోగంగా స్టేడియంలోని గ్యాలరీలు
- పనికి రాకుండా పోయిన హాళ్లు
- సాధారణ రోజుల్లో మరింత దారుణం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: శ్రీరామ నవమి వచ్చేస్తోంది. అధికారుల హడావిడి మొదలైంది. చలువ పందిళ్లు, టికెట్ల అమ్మకాలు, గోటి తలంబ్రాలు, ప్రసాదం తదితర అంశాలపై సమీక్షలు ప్రారంభమయ్యాయి. కానీ ప్రతీ నవమికి భక్తులు పడుతున్న ఇబ్బందులను తీర్చే దిశగా అడుగులు పడుతున్న దాఖలాలు మాత్రం లేవు.

సామాన్య భక్తులకు నిరాశే..

దేశంలో ఎక్కడా లేని విధంగా చైత్ర శుద్ధ నవమిన సీతారాములకు కల్యాణం జరిపించే సంప్రదాయాన్ని భక్త రామదాసు భద్రాచలంలో ఆరంభించారు. ఆ తర్వాత రెండు తెలుగు రాష్ట్రాల్లో ఊరూ వాడ నవమి రోజున సీతారాముల పెళ్లి చేస్తున్నారు. నవమికి భద్రాద్రికి పోటెత్తుతున్న భక్తులను దృష్టిలో ఉంచుకుని ఆలయం వెలుపల 1960లో కల్యాణ మండపం పనులు ప్రారంభించగా 1964లో నిర్మాణం పూర్తయింది. ఆ తర్వాత మండపంలో సీతారాముల కల్యాణం భక్తులు కనులారా చూసేందుకు వీలుగా 1988లో అప్పటి సీఎం ఎన్టీఆర్ కల్యాణ మండపం చుట్టూ గ్యాలరీలు నిర్మించి మిథిలా స్టేడియంగా నామకరణం చేశారు. కాలక్రమంలో మిథిలా స్టేడియం మధ్య భాగంలో ఎత్తుగా మట్టి పోయడంతో కల్యాణ మండపం, గ్యాలరీల మధ్య సమతూకం లేకుండా పోయింది. ఫలితంగా ప్రత్యక్షంగా సీతారాముల కల్యాణ వేడుక చూద్దామని భద్రాచలం వచ్చి గ్యాలరీలో కూర్చునే సామాన్య భక్తులకు నిరాశే ఎదురవుతోంది. కనీసం గ్యాలరీల దగ్గర ఎల్ఈడీ స్క్రీన్లు కూడా ఏర్పాటు చేయడం లేదు.

పట్టింపు లేని వైనం..

భద్రాచలంలో ప్రధాన ఆలయం పక్కనే సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో మిథిలా స్టేడియం ఉంది. ఏడాదిలో నవమి సందర్భంగా పూర్తిగా, ముక్కోటి సమయంలో పాక్షికంగా ఈ స్టేడియాన్ని శుభ్రం చేసి భక్తులు వచ్చి పోయేందుకు అనువుగా ఉంచుతున్నారు. మిగిలిన సమయాల్లో కనీసం ఇటు కన్నెత్తి చూసే వాళ్లు కరువైపోతున్నారు. ఫలితంగా ఆలయం పక్కనే రెండెకరాల స్థలంలో ఉన్న మిథిలా స్టేడియం అపరిశుభ్రతకు కేరాఫ్ అడ్రస్‌గా మారి కనీసం భక్తులు కాలు పెట్టేందుకు వీలు లేని పరిస్థితి తలెత్తుతోంది.

అన్నీ నిరుపయోగమే..

మిథిలా స్టేడియం గ్యాలరీలకు దిగువ భాగంలో పెద్ద హాళ్లు ఉన్నాయి. వీటికి గోదావరి ఉప నదులైన సీలేరు, శబరి, కిన్నెరసాని, తాలిపేరు, వశిష్ట, ఇంద్రావతి, ప్రాణహిత, మానేరు, మంజీర, పెన్‌గంగా, వార్ధా వంటి పేర్లు పెట్టారు. మరికొన్ని హాళ్లలో నిత్యాన్నదాన సత్రం, హనుమాన్ భజన మందిరం, విద్యుత్ మానిటరింగ్ వ్యవస్థలు కొనసాగుతున్నాయి. ఇక ఉప నదుల పేరుతో ఏర్పాటు చేసిన పెద్ద హాళ్లన్నీ నిరుపయోగంగా మారాయి. వీటి నిర్వహణపై దృష్టి పెట్టకపోవడంతో బూజు పట్టి, దుమ్ము కొట్టుకుపోయి గబ్బిలాలకు నిలయంగా మారుతున్నాయి. ఇక మిథిలా స్టేడియంలోకి వచ్చి పోయే ద్వారాలన్నీ సులభ్ కాంప్లెక్సుగా మారాయని చెప్పక తప్పదు. స్టేడియంలోకి వచ్చి పోయేందుకు ఆరుకు పైగా ఎంట్రీలు ఉండగా ఒకటి తప్ప మిగిలిన ద్వారాల నుంచి కనీసం అడుగు పెట్టలేనంత దారుణ పరిస్థితి ఉంది. స్టేడియంలోని గ్యాలరీల్లో కూడా ఏడాది పొడవునా ఇంచుమించు ఇదే పరిస్థితి నెలకొని ఉంటోంది. కేవలం నవమి, ముక్కోటి సందర్భాల్లో తూతూ మంత్రంగా శుభ్రం చేసి ఆ తర్వాత నిర్వహణ గాలికి వదిలేస్తున్నారు. ఏడాదంతా స్టేడియం భక్తులకు ఏ కోశాన సేవలు అందించలేకుండా పోతోంది.

కన్నెత్తి చూడరే !

శ్రీరామ నవమి ఉత్సవాలపై ఆలయం ఎగ్జిక్యూటివ్ అధికారి మొదలు దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ వరకు అధికారులు పలు సమీక్షలు నిర్వహించారు. ఏ ఒక్క సమీక్షలోనూ సామాన్య భక్తులు ఉపయోగించే మిథిలా స్టేడియం నిర్వహణ అంశం చర్చకు రాలేదు. వీఐపీ గ్యాలరీలు, టికెట్ల అమ్మకం, తలంబ్రాలు వంటి అంశాలకే సమీక్షలు పరిమితం అవుతున్నాయి. కనీసం క్షేత్రస్థాయిలో ఒక్కసారి స్టేడియాన్ని అధికార యంత్రాంగం నిశితంగా పరిశీలిస్తే చాలు.. 'మిథిల' పడుతున్న వ్యథ కళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది. కేవలం టికెట్ కొని కల్యాణం చూసే భక్తుల సౌకర్యాల కోసమే కాకుండా ఎంతో దూరం నుంచి రామయ్య – సీతమ్మల పెళ్లి చూడాలని భద్రాచలం చేరుకుని మిథిలా స్టేడియానికి వచ్చేవారి ఇబ్బందులపై దృష్టి పెట్టాలని భక్తులు కోరుతున్నారు.



అధికారుల అలసత్వంతో పేరుకుపోయిన చెత్త



విద్యుత్ కాంతులతో వెలుగొందుతున్న రామాలయం

వేడుకలకు వేళాయె..

- భద్రగిరిలో నేటి నుంచి బ్రహ్మోత్సవాలు
- గవర్నర్‌కు ఆహ్వానపత్రిక అందజేసిన ఈఓ



గవర్నర్‌కు ఆహ్వానపత్రం అందజేస్తున్న ఈఓ, అర్చకులు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం వసంత పక్ష ప్రయుక్త నవాహ్నిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. శ్రీరామనవమి వేడుకలకు కూడా నేడే అంకురార్పణ చేయనున్నారు. క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా ప్రసాద వితరణ అనంతరం 9 గంటలకు ఉత్సవాలు ప్రారంభించనున్నారు. రుత్విక్ వరణం, రక్షాబంధనం, స్నపన తిరుమంజనం, మత్స్యంగ్రహణం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం స్వామివారికి కల్పవృక్ష వాహనంలో తిరువీధి సేవ జరిపిస్తారు. అనంతరం బేడా మండపంలో శ్రీ సీతారాముల వారికి అర్చకులు, పండితులు పంచాంగ శ్రవణం గావిస్తారు. కాగా, బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించగా.. భద్రగిరిలో ప్రత్యేక శోభ సంతరించుకుంది.

గవర్నర్‌కు ఆహ్వానపత్రిక..

శ్రీ సీతారాముల కల్యాణం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు ఆలయ ఈఓ రమాదేవి, వైదిక కమిటీ సభ్యులు సోమవారం హైదరాబాద్‌లో ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా పండితులు వేదాశీర్వచనం చేసి స్వామి వారి జ్ఞాపిక, ప్రసాదం అందించారు. స్వామివారి కల్యాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి, మరుసటి రోజు జరిగే పట్టాభిషేక మహోత్సవానికి గవర్నర్ వచ్చే సంప్రదాయం గురించి రాధాకృష్ణన్‌కు ఈఓ వివరించారు.

కల్యాణ వైదిక పెద్దలు వీరే..

నవమి రోజున శ్రీ సీతారామ కల్యాణం నిర్వహించే వారిలో వైదిక పెద్దలు ప్రముఖ పాత్ర పోషిస్తారు. బ్రహ్మోత్సవాల ప్రారంభం నుంచి ఉత్సవాలు ముగిసే వరకు ప్రతీ క్రతువులో వీరు పాల్గొని ఎలాంటి ఆటంకాలు లేకుండా జరిగేలా శాస్త్రోక్త పాత్ర పోషిస్తారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాల్లో అధ్వర్యులుగా పొడిచేటి సీతారామానుజాచార్యులు, బ్రహ్మగా అమరవాది గోపాలకృష్ణమాచార్యులు, ఆచార్యులుగా కోటి శ్రీమన్నారాయణాచార్యులు, రుత్విక్‌లుగా అమరవాది మురళీకృష్ణమాచార్యులు, సీతారామాచార్యులు, పరిచార రుత్వికులుగా రాఘవాచార్యులు, అలంకరాల రుత్విక్‌లుగా కోటి రామ స్వరూప్, కోటి విష్ణు వ్యవహరిస్తారు.

వ్యవసాయ క్షేత్రంలో మంత్రి తుమ్మల

దమ్మపేట: మండలంలోని లింగాలపల్లిలో తన వ్యవసాయ క్షేత్రాన్ని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తోటలోని మామిడి, కొబ్బరి, వక్క, కోకో పంటలతో పాటు లేత మామిడి తోటలో వచ్చిన కాయలను పరిశీలించారు. తొలుత ద్వారకా తిరుమలలో శ్రీవెంకటేశ్వర స్వామిని మంత్రి దర్శించుకున్నారు. కాంగ్రెస్ నాయకులు కాసాని నాగప్రసాద్, దొడ్డా ప్రసాద్, తుమ్మల శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.



మామిడి కాయలను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

సేవ చేసి రుణం తీర్చుకుంటా..

- ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి
- ఖమ్మం ఎంపీ సీటు రాహుల్‌కు బహుమతిగా ఇద్దాం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



పార్టీ కార్యకర్తలతో మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, వెంకట్రావు

జూలూరుపాడు: ఇది ప్రజల రాజ్యమని, ప్రజాదీవెనతో ఏర్పడిన ఇందిరమ్మ రాజ్యంలో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. తనకు దక్కిన ఈ అవకాశంతో ప్రజలకు సేవ చేసి రుణం తీర్చుకుంటానని చెప్పారు. సోమవారం ఆయన జూలూరుపాడులో పర్యటించగా.. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పొంగులేటి మాట్లాడుతూ.. రైతుల, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానన్నారు. చెప్పిన మాట ప్రకారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి పది సీట్లు సాధించామని అన్నారు. ఖమ్మం ఎంపీ సీటు కూడా అత్యధిక మెజార్టీతో గెలిపించి రాహుల్ గాంధీకి బహుమతిగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఎంపీ అభ్యర్థిగా అధిష్టానం ఎవరిని ప్రకటించినా గెలుపే ధ్యేయంగా పని చేయాలని కోరారు. గత బీఆర్‌ఎస్ పాలకులు గొప్పలకు పోయి ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణాను అప్పుల్లోకి నెట్టారని విమర్శించారు. ఇప్పుడు రైతుల పొలాల వద్దకు వెళ్లి మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేలా కృషి చేస్తానని చెప్పారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ.. సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాగా, కాకర్లలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు అల్లాడి నరసింహారావు, అల్లాడి లింగారావు మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు బొర్రా రాజశేఖర్, లేళ్ల వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు మాళోత్ మంగీలాల్ నాయక్, నాయకులు దుద్దుకూరి మధుసూదన్ రావు, బానోత్ స్వాతి, రోకటి సురేష్, నున్నా కృష్ణయ్య, వేల్పుల నరసింహారావు, యల్లంకి పుల్లయ్య, యల్లంకి చిన్న నాగేశ్వరరావు, దుద్దుకూరి నరసింహారావు, ధరావత్ రాంబాబు, పోతురాజు నాగరాజు, లకావత్ లచ్చునాయక్, శీరంశెట్టి భూపతిరావు పాల్గొన్నారు.

గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలి

బీజేపీ మానుకోట లోక్‌సభ అభ్యర్థి సీతారాం నాయక్



మణుగూరులో మాట్లాడుతున్న సీతారాంనాయక్

భద్రాచలం/మణుగూరు రూరల్/మణుగూరు టౌన్: మహబూబాబాద్ లోక్‌సభ స్థానంపై బీజేపీ జెండా ఎగురవేయడానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ అభ్యర్థి మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాం నాయక్ కోరారు. భద్రాచలం, మణుగూరులో సోమవారం జరిగిన సన్నాహక సమావేశాల్లో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో తన పాత్రను గుర్తించి బీజేపీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చిందన్నారు. కార్యకర్తలు గడపగడపకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి తన విజయానికి సహకరించాలని కోరారు. కాగా, బీఆర్‌ఎస్ వల్లే కరువు వచ్చిందని విమర్శిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కరువు వివరాల నివేదిక కేంద్రానికి ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలన్నారు. ఈసమావేశాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్, నాయకులు తెల్లం శేఖర్, వెంకటనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రంగాకిరణ్, సతీష్, త్రినాథ్‌రావు, కుంజా ధర్మారావు, చలపతి, రాంబాబు, జంపన సీతారామరాజు, పున్నం బిక్షపతి, లింగంపల్లి రమేష్, నూకల వెంకటనారాయణరెడ్డి, పొడియం బాలరాజు తదితరులు ఉన్నారు.

తాగునీటి ఎద్దడి రానీయొద్దు

- అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలి
- ఆర్‌డబ్ల్యూఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా



కుమ్మరిగూడెంలో వలస ఆదివాసీ గిరిజనులతో మాట్లాడుతున్న సందీప్‌కుమార్ సుల్తానియా, కలెక్టర్ ప్రియాంక ఆల, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ తదితరులు

అశ్వాపురం: వచ్చే రెండు నెలలు తాగునీటి ఎద్దడి రాకుండా అన్ని చర్యలు చేపట్టాలని, మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా ఆదేశించారు. అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలో మిషన్ భగీరథ ఇన్ టేక్‌వెల్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం మిట్టగూడెం వద్ద రథంగుట్టపై ఉన్న వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను సందర్శించారు. ప్లాంట్ సమీపాన వలస ఆదివాసీ గిరిజనుల ఆవాసాలను పరిశీలించి.. తాగునీరు సక్రమంగా సరఫరా అవుతోందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సుల్తానియా మాట్లాడుతూ రెండు నెలల పాటు ప్రజలకు ఇబ్బంది లేకుండా తాగునీరు సరఫరా చేయాలన్నారు. ఇన్ టేక్‌వెల్ వద్ద గోదావరిలో నీటిమట్టం తగ్గితే ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి ఎగువ ప్రాంత ప్రాజెక్టుల నుంచి నీరు విడుదలయ్యేలా చూడాలన్నారు.

పక్కా ప్రణాళికతో సిద్ధం కావాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): తాగునీటి సరఫరాపై అధికారులు పక్కా ప్రణాళికలతో సిద్ధం కావాలని సందీప్‌కుమార్ సుల్తానియా అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రహదారి మార్గం లేని హ్యాబిటేషన్లలో డబ్బాల ద్వారా నీరు సరఫరా చేసే నూతన విధానాన్ని ప్రవేశపెట్టిన కలెక్టర్‌ను అభినందించారు. జిల్లాలో తాగునీటి సరఫరాపై తీసుకున్న ప్రణాళిక, కార్యాచరణ అభినందనీయమని అన్నారు. జిల్లాలో నీటి లభ్యత ఉందని, ప్రణాళికాబద్ధంగా ఉపయోగించి సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని చెప్పారు. చుక్క నీరు కూడా వృథా కాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. క్లోరినేషన్ పరీక్షలు ఎన్నిసార్లు చేస్తున్నారో తనిఖీ చేయాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. వేసవిలో తాగునీటికి డిమాండ్ పెరగడంతో పాటు సరఫరా తగ్గుతుందని, దానికి అనుగుణంగా ప్రణాళికాయుతంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. చేతి పంపులు, బోర్లు మరమ్మతు చేయించాలన్నారు. తాగునీటి సమస్యపై ప్రతికల్లో వచ్చే కథనాలకు తక్షణమే స్పందించాలని చెప్పారు. అనంతరం కలెక్టర్ ప్రియాంక ఆల మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్‌డీఎఫ్ పనుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. పనుల్లో జాప్యంపై అసహనం వ్యక్తం చేశారు. అన్ని పనులూ వారంలోగా పూర్తిచేసి పనుల ఫొటోలను నివేదిక రూపంలో అందజేయాలని ఆదేశించారు. మండల, పంచాయితీ అధికారులు తమ పరిధిలోని నీటి సరఫరా కేంద్రాలను నిత్యం తనిఖీ చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్, డీఎఫ్‌ఓ కృష్ణగౌడ్, మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి, సీఈ శ్రీనివాస్, ఎస్‌ఈ సదాశివకుమార్, డీఆర్‌డీఓ విద్యాచందన, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, జెడ్పీ సీఈఓ ప్రసూనరాణి, భూగర్భ జలశాఖ అధికారి బాలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ తిరుమలేష్, డీఈ మహేందర్‌రెడ్డి, ఏఈలు ప్రశాంత్, కిషోర్ పాల్గొన్నారు.

సమన్వయంతో సేవలందించాలి

ఆర్‌డీఓ దామోదర్‌రావు



మాట్లాడుతున్న ఆర్‌డీఓ దామోదర్ రావు

భద్రాచలం: భద్రాచలంలో ఈ నెల 17, 18 తేదీల్లో జరిగే శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణం, పట్టాభిషేక మహోత్సవాలకు వచ్చే భక్తులకు స్వచ్ఛంద సంస్థలు, అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ భక్తులకు సేవలందించాలని ఆర్‌డీఓ దామోదర్‌రావు అన్నారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో ఆయన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో కుటుంబ సభ్యులతో వచ్చే భక్తులకు ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు మంచినీరు, మజ్జిగ పాకెట్లు సరఫరా చేస్తున్నారని, వాటిని సంస్థ సభ్యులు భక్తులందరికీ అందే విధంగా చూడాలని కోరారు. వలంటీర్లను కౌంటర్ల వారీగా నియమించి భక్తులకు అసౌకర్యానికి గురి కాకుండా చూడాలని సూచించారు. వలంటీర్లకు సెక్టార్ల వారీగా గుర్తింపు కార్డులు అందజేస్తామని, వాటిని ప్రతీ ఒక్క వలంటీర్ ధరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కాగా తొలుత వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల కోసం ఏర్పాటు చేసే వైద్య శిబిరాలు, సమాచార కేంద్ర ప్రదేశాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జీఎం (ఇండస్ట్రీస్) తిరుపతయ్య, మిషన్ భగీరథ డీఈ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, హెచ్ఈఓ దుర్గయ్య, జీపీఈఓ శ్రీనివాస్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, విజయలక్ష్మి, దామోదర్ రావు, రాజారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

'సరిహద్దు'లో నిఘా పటిష్టం చేయాలి

అశ్వారావుపేటరూరల్ : రాష్ట్ర, జిల్లా సరిహద్దు ప్రాంతాలల్లో నిఘా పటిష్టం చేయాలని, గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక శ్రద్ధచూపాలని మల్టీజోన్ వన్ ఐజీ ఏవీ రంగనాథ్ ఆదేశించారు. పోలీస్ విభాగాల అధికారులతో ఆయన సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం స్థానిక సీఐ జితేందర్ రెడ్డి మా ట్లాడుతూ.. అశ్వారావుపేట పోలీస్ సర్కిల్ పరిధిలో రాష్ట్ర సరిహద్దు ఉన్నందున గంజాయి అక్రమ సరఫరా, వినియోగం, నివారణపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గంజాయి వినియోగం, అక్రమ రవాణాకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తుక్కు రవాణాపై త్రిసభ్య కమిటీ విచారణ

పాల్వంచ : కేటీపీఎస్ ఓఅండ్ఎం కర్మాగారం నుంచి తుక్కు రవాణాపై విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో త్రిసభ్య కమిటీ గత రెండు రోజుల పాటు విచారణ చేసింది. జెన్‌కో సీఎండీ రిజ్వీ ఆదేశాల మేరకు ఆది, సోమవారాల్లో కమిటీ సభ్యులు వీరస్వామి, పాండురంగారెడ్డి, మైపాల్.. కర్మాగారంలో విడిభాగాలను తుక్కుగా మార్చి తరలిస్తున్న ప్రాంతాల్లో పర్యటించారు. తరలింపు తీరు నిబంధనలకు అనుగుణంగా ఉందా లేదా అనే విషయమై అధ్యయనం చేశారు. అనంతరం సీఈ పి.వెంకటేశ్వరరావు, ఎస్ఈ కిరణ్‌కుమార్‌తో చర్చించారని సమాచారం.

వేతనాలు చెల్లించాలి



ఆందోళన చేస్తున్న కార్మికులు

పాల్వంచ: పెండింగ్ వేతనాలు చెల్లించాలని కేటీపీఎస్ ఎఫ్‌జీడీ ప్లాంట్ నిర్మాణ కార్మికులు సోమవారం ఆందోళన చేపట్టారు. కేటీపీఎస్ 7వ దశ ఎదుట ఉన్న ఎఫ్‌జీడీ ప్లాంట్ నిర్మాణ పనుల వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ బీహెచ్ఈఎల్ సబ్ కాంట్రాక్ట్ సంస్థ ఆర్‌వీపీఆర్ కంపెనీ తమకు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలన్నారు. దీంతో సంబంధిత అధికారులు చర్చలు జరిపారు. కనగాల శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరాజు, ఎండీ.ఖాదర్ బాబా, ఆర్.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కామెర్లతో చిన్నారి మృతి



సౌమ్య (ఫైల్)

కరకగూడెం: అనారోగ్యంతో బాలిక మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. కరకగూడెం గ్రామానికి చెందిన బాలిక సౌమ్య(8)కు కామెర్లు రావడంతో మణుగూరు, హైదరాబాద్‌లలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స అందించారు. పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందింది. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురాగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సందర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అండగా ఉంటానని భరోసా కల్పించారు.

వన్యప్రాణుల వేటకు వచ్చిన వారిపై కేసు నమోదు

పెనుబల్లి: తల్లాడ అటవీ రేంజ్ పెనుబల్లి మండలం తాళ్లపెంట శివారు అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల వేటకు వచ్చిన పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం అర్ధరాత్రి హైదరాబాద్‌కు చెందిన పుష్పాల సుగ్రీవ్, వెంకట శ్రీకాంత్, నారాయణ, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన నాగరాజు, చంద్రుగొండ మండలానికి చెందిన డేరంగుల మిథున్‌కుమార్, బొర్ర సురేష్, విజయనగరం జిల్లాకు చెందిన బొడ్డెన నారాయణరావు నాటు తుపాకీ, గొడ్డళ్లు, కత్తులతో కారులో రాగా, అటవీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ లావణ్య ఫిర్యాదుతో వారిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఊరంతా ఉగాది..

నేడు తెలుగు సంవత్సరాది

- శ్రీక్రోధి నామ సంవత్సరం ఆరంభం
- పంచాంగ శ్రవణం, షడ్రుచుల పచ్చడి ప్రత్యేకం
- ఇళ్లు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు

తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ వచ్చేసింది. తెలుగు రాష్ట్రాల్లో ప్రజలకు ఎంతగానో ఇష్టమైన పండుగ కాగా, మంగళవారం సంప్రదాయబద్ధంగా జరుపుకునేందుకు అంతా సిద్ధమయ్యారు. సోమవారంతో శోభకృత్ నామ సంవత్సరం ముగియగా, నేటి నుంచి శ్రీక్రోధి నామ సంవత్సరం ఆరంభం కానుంది. ఉగాదిని పురస్కరించుకుని రాశి ఫలాలు, పంచాంగం శ్రవణం చేయడంతోపాటు షడ్రుచుల పచ్చడిని సేవించనున్నారు. –కొత్తగూడెంటౌన్/ఇల్లెందురూరల్



ఇతర రాష్ట్రాల్లో..

హిందూ చంద్రమాన క్యాలెండర్ (పంచాంగ) ప్రకారం కొత్త సంవత్సరం మొదటి రోజున జరుపుకునే పండుగ ఉగాది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గోవా, రాష్ట్రాల్లో ఈ వేడుకను జరుపుకుంటారు. హిందూ క్యాలెండర్ నెల చైత్రమాసం మొదటిరోజు సాధారణంగా గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారం మార్చి లేదా ఏప్రిల్‌లో వస్తుంది. అదే రోజును మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గోవా, దాద్రా, నగర్ హవేలీ, డామన్, డయ్యూలలో కొత్త సంవత్సరం (గుడి పడ్వా) పండుగ జరుపుకుంటారు.

షడ్రుచుల పచ్చడి..

తెలుగు ప్రజలు ఉగాదిని ఘనంగా జరుపుకుంటారు. ఈ రోజున సంతోషంగా ఉంటే ఏడాదంతా సంతోషంగా ఉంటామని భావిస్తారు. ఉగాదికి ప్రత్యేకత షడ్రుచుల పచ్చడి. ఉగాది పచ్చడికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. షడ్రుచులు భావోద్వేగాలకు ప్రతీకలుగా పెద్దలు చెబుతుంటారు. బెల్లం, అరటి పండు(తీపి) ఆనందం, వేపపువ్వు (చేదు) దు:ఖం, బాధ, పచ్చిమిరపకాయలు (కారం) వేడి, కోపం, ఉప్పు(ఉత్సాహం), జీవిత సారం చింతపండు (పులుపు) నేర్పుగా ఉండాల్సిన పరిస్థితి, వగరు (మామిడి) కొత్త సవాళ్లు .. ఇలా జీవిత సారం ఉగాది పచ్చడిలో ఉంటుంది. షడ్రుచుల కలయికైన ఉగాది పచ్చడిని స్వీకరిస్తే జీవితానికి పరమార్థం ఉంటుందని పండితులు పేర్కొంటున్నారు.

పంచాంగ శ్రవణం..

తెలుగువారు ఉగాది రోజున ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేస్తారు. కొత్త ఏడాది తమ రాశి ఫలాలు ఎలా ఉన్నాయో వేదపండితులు, అర్చకులను అడిగి తెలుసుకుంటారు. పంచాంగ శ్రవణంలో మన స్థితిగతులను ముందుగా తెలుసుకుంటారు.

గంగా స్నానం చేసినంత పుణ్యం..

పంచాంగ పఠన శ్రవణ భాగ్యం వల్ల గంగాస్నానం చేసినంత పుణ్యం ప్రాప్తిస్తుందని పండితులు పేర్కొంటున్నారు. చైత్ర శుక్ల పాడ్యమినాడు నూతన సంవత్సర ఫలాలను వినే జనాలకు దుఃఖ దరిద్రాలు తొలుగునని, రోగశాంతి, ధన ధాన్య, సమృద్ధి చేకూరునని, పంచాంగ శ్రవణం వల్ల ఎంతో పుణ్యఫలం లభిస్తుందని వేద పండితులు, అర్చకులు చెబుతున్నారు.

తెలుగువారి తొలి పండుగ..



తెలుగువారికి ప్రీతికరమైన పండుగ ఉగాదిని ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఉగాది రోజున పంచాంగం విన్నా, పఠించినా పుణ్యఫలం సిద్ధిస్తుంది. జీవితంలో బాధ, సంతోషం అన్ని కలిసిన షడ్రుచుల పండుగ ఉగాది. తెలుగువారి తొలి పండుగ కావడంతో ఇళ్లు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తారు. –దేవరకొండ శ్రీనివాసశర్మ, వేదపండితులు, విద్యానగర్ కాలనీ, కొత్తగూడెం

అందరికీ ఇష్టమైనది



తెలుగు వారందరూ ఇష్టంగా జరుపుకునే తొలి పండుగ ఉగాది. ఈ పండుగ రోజున ఆలయ దర్శనం చేయడం, పెద్దలు, గురువుల ఆశీర్వాదం తీసుకోవడం వల్ల పుణ్యఫలం సిద్ధిస్తుంది. ఉగాది పచ్చడిని సేవించడం సంప్రదాయం. ఆరోగ్యపరంగానూ మేలు చేస్తుంది. – జిల్లోజు రామాచార్యులు, అర్చక, పురోహితుల సంఘం జిల్లా కార్యదర్శి

ఘనంగా పొంగళ్ల జాతర

పూజలు చేసిన కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్



జాతరలో పూజలు చేస్తున్న కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ తదితరులు

బూర్గంపాడు: సారపాక గాంధీనగర్‌లోని శ్రీ కనక దుర్గ అమ్మవారి ఆలయంలో పొంగళ్ల జాతర సోమవారం ప్రారంభమైంది. వేదపండితుల మంత్రోచ్ఛరణలతో అమ్మవారి పొంగళ్ల జాతర శాస్త్రోక్తంగా మొదలైంది. ప్రజలు రోగాల బారిన పడకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఏటా ఈ జాతరను నిర్వహిస్తున్నారు. మహిళలందరు పొంగళ్లతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కేంద్ర మాజీ మంత్రి, మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పొంగళ్ల జాతర ఏర్పాట్లను ఆలయ ప్రధాన అర్చకులు వెల్ది శివసాయికుమార్, ఆలయ కమిటీ ప్రతినిధులు అజ్మీరా రాంజీనాయక్, పప్పు కుమారస్వామి, సిలివేరు శ్రీనివాసరావు, నాగులంచ రమేష్, భూక్యా రమేష్, కర్రి జగన్నాధరావు, పాలిన రమేష్, కానూరి మోహన్‌రావు తదితరులు పర్యవేక్షించారు.

సంతాప సభకు విరాళాల సేకరణ



ఆళ్లపల్లిలో విరాళాలు సేకరిస్తున్న దృశ్యం

గుండాల: మూడు దశాబ్దాలకు పైగా న్యూడెమోక్రసీ (ప్రస్తుతం ప్రజాపంథా) పార్టీలో పనిచేసి అనారోగ్యంతో మృతి చెందిన తన తండ్రి కోరం జగ్గన్న సంతాప సభకోసం విరాళాలు సేకరిస్తున్నట్లు మాజీ దళ కమాండర్ కోరం గణేష్ తెలిపారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన తండ్రి జూలూరుపాడు, సుజాతనగర్ మండలాల్లో పార్టీ ఆదేశాల మేరకు అనేక పోరాటాల్లో పాల్గొన్నాడని, పోడు భూములు పంచిపెట్టాడని, ఉప సర్పంచ్ పదవిని సైతం వదులుకున్నాడని తెలిపారు. తాను 2003 నుంచి సీపీయూఎస్ఐ, జనశక్తి, న్యూడెమోక్రసీ అజ్ఞాతదళాల్లో పని చేసి జనజీవన స్రవంతిలో కలిసినట్లు వివరించా రు. ప్రభుత్వం పునరా వాసం కల్పించలేదని, పోడు సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తుండగా, తన పోడు భూ మిని సైతం అటవీశాఖ అధికారులు లాక్కున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పంటలు సరిగ్గా పండక, గిట్టుబాటు ధరలేక ఆర్థిక పరిస్థితి బాగలేదని పేర్కొన్నారు. అన్ని పార్టీల ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించేందుకు విరాళాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన కారు



కూలిన రేకుల షెడ్డు

కరకగూడెం: వేగంగా వచ్చిన ఓ కారు దుకాణంలోకి దూసుకెళ్లిన సంఘటన సోమవారం తెల్లవారుజామున జరిగింది. హైదరాబాద్ నుంచి మణుగూరు వైపు వెళ్తున్న క్రమంలో కారు అదుపుతప్పి కరకగూడెం సెంటర్ మూలమలుపు సమీపంలోని ప్రసాద్ మెడికల్ దుకాణంలోకి దూసుకెళ్లింది. దీంతో దుకాణం ఆవరణలో ఉన్న రేకుల షెడ్డు పూర్తిగా ధ్వంసమైంది. పక్కనే ఉన్న మరో దుకాణంలో రేకులు ధ్వంసమయ్యాయి. కారూ దెబ్బతిన్నది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సుమారు రూ.లక్ష వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. కాగా డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతోనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

యువకుడి మృతి



శివాజీ (ఫైల్)

అశ్వారావుపేట(ములకలపల్లి) : బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మాధారం అటవీప్రాంతంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కుమ్మరిపాడు గ్రామానికి చెందిన పద్దం శివాజీ (31) వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం భార్య స్వాతితో కలిసి ద్విచక్ర వాహనంపై ఒడ్డురామవరంలో ఫంక్షన్‌కు వెళ్లారు. సాయంత్రం భార్యను ఆటోలో ఇంటికి పంపించిన శివాజీ రాత్రి 10 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై కుమ్మరిపాడు బయలుదేరాడు. ఈ క్రమంలో మాధారం అటవీ ప్రాంతంలో పాల్వంచ వైపు వెళుతున్న వాహనం బైక్‌ను ఎదురుగా ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో శివాజీ తీవ్రంగా గాయపడగా, అటుగా వెళుతున్న వ్యక్తులు 108 ద్వారా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజమౌళి తెలిపారు.

మద్యం స్వాధీనం

దమ్మపేట: అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపుపై సోమవారం పోలీసులు, ఎఫ్ఎస్‌టీం సంయుక్తంగా దాడి చేశారు. దమ్మపేటలోని అర్బన్‌కాలనీలో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా ఎఫ్ఎస్‌టీం అధికారి కృష్ణ ఆధ్వర్యంలో దాడి చేశారు. 92 క్వార్టర్ మద్యం సీసాలు, 7 బీర్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఎస్సై సాయి కిషోర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాద మృతిపై కేసు నమోదు

దుమ్ముగూడెం : రోడ్డు ప్రమాద మృతిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ గణేష్ కథనం ప్రకారం.. మండలంలోని పైడిగూడెం గ్రామానికి చెందిన కంగాల గంగరాజు(38) గత నెల 30న ఆంధ్రాలోని చింతూరులో బంధువుల ఇంట్లో కర్మలకు వెళ్లి బైక్‌పై తన బాబాయి కన్నయ్యతో కలిసి తిరిగివస్తున్నాడు. ఈక్రమంలో మారాయిగూడెం శివారులో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో గంగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు భద్రాచలం ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు గంగరాజు మృతికి కారకుడైన చల్లసముద్రం గ్రామానికి చెందిన మోకాళ్ల శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలిక అదృశ్యం

భద్రాచలం (భద్రాచలం అర్బన్): బాలిక అదృశ్యంపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై పీవీఎన్ రావు కథనం ప్రకారం.. పట్టణంలోని ఏఎంసీ కాలనీకి చెందిన ఓ మైనర్ బాలిక శనివారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లేదు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కూలర్ కడుగుతుండగా..

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



సయ్యద్ షోయబ్ (ఫైల్)

కొత్తగూడెంటౌన్: కూలర్ కడుగుతూ ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం కొత్తగూడెం టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధి రామవరంలో చోటుచేసుకుంది. బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని రామవరం 7వ నంబర్ బజార్‌కు చెందిన సయ్యద్ షోయబ్ (28) కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఉదయం ఇంట్లో మోటార్ ఆన్ చేసి కూలర్‌ను కడుగుతున్నాడు. ఈ క్రమంలో మోటార్ వైర్ తెగి కాలుపై పడగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. అప్పటికే మోటార్ పంపుతో నీళ్లు పట్టి ఉండగా, కూలర్ వద్ద అంతా తడిసిపోయింది. కొద్దిసేపటి తర్వాత గమనించిన సోదరి షోయబ్‌ను రక్షించేందుకు దగ్గరకు రాగా, ఆమెకు స్వల్పంగా షాక్ కొట్టింది. దీంతో కరెంట్ ఆఫ్ చేసి వచ్చి అన్నకు శ్వాసను అందించే ప్రయత్నం చేసింది. కొత్తగూడెం ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు.

రంజాన్ పండుగ ముందు విషాదం..

రంజాన్ పండుగకు ముందు ఆ ఇంట్లో విషాదం నెలకొంది. కుటుంబం సభ్యులందరూ శోకసంద్రంలో మునిగిపోయారు. షోయబ్ తల్లి, కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి అవివాహితుడు. కాగా అతని తండ్రి షఫీ కొంత కాలం క్రితం మృతి చెందాడు.

టాటా మ్యాజిక్ వాహనం దగ్ధం



కాలిపోయిన వాహనం

జూలూరుపాడు: మండలంలోని శంభునిగూడెం గ్రామానికి చెందిన ఈసాల దినేష్ ఇంటి ఎదుట నిలిపి ఉన్న టాటా మ్యాజిక్ ప్యాసింజర్ వాహనం ప్రమాదవశాత్తు దగ్ధమైన సంఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. శంభునిగూడెం గ్రామానికి చెందిన దినేష్ మూడు నెలల క్రితం రూ 6.30 లక్షల విలువైన టాటా మ్యాజిక్ ప్యాసింజర్ వాహనం కొనుగోలు చేశాడు. ఆదివారం సాయంత్రం వరకు కిరాయిలు చేసుకుని తిరిగి వచ్చి వాహనం ఇంటి ముందు నిలిపాడు. దినేష్ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో వాహనంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించి దగ్ధమైంది. అయితే ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

గంజాయి స్వాధీనం



గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

భద్రాచలం (భద్రాచలంఅర్బన్): భద్రాచలం మీదుగా అక్రమంగా రవాణా చేస్తున్న 25కిలోల గంజాయిని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ విజయలక్ష్మి కథనం ప్రకారం.. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో భద్రాచలం మీదగా వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో తనిఖీలు నిర్వహించగా, ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారి లగేజ్ బ్యాగ్‌లను తనిఖీ చేయగా 25కేజీల గంజాయి లభించింది. అదుపులోకి తీసుకుని విచారించగా, వారిద్దరూ ఢిల్లీకి చెందిన వ్యక్తులని, ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్నట్లు తేలింది. పట్టుకున్న గంజాయి విలువ రూ.6.25లక్షలు ఉంటుందని, నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.